క్లుప్తంగా

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి

బోనకల్: మండలంలోని అన్ని గ్రామాల రెవెన్యూ పరిధిలో జూన్ 28, 2024లోపు కొత్తగా పట్టాదారు పాస్‌పుస్తకాలు పొందిన రైతులు రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఎస్.సరిత సూచించారు. రైతుకు 18 నుండి 59 సంవత్సరాలు గల రైతులు రైతుబీమా నమోదుకు అర్హులని, వచ్చేనెల 5తో గడువు ముగుస్తుందన్నారు. అర్హులు దరఖాస్తు ఫారం, పట్టాదారు పాస్‌పుస్తకం, పట్టాదార్, నామినీ ఆధార్‌కార్డులను దరఖాస్తు ఫారంను సంబంధిత వ్యవసాయ విస్తరణాధికారికి అందించాలని కోరారు.

వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత లేదు


మాట్లాడుతున్న బొంతు రాంబాబు

వైరా: కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయరంగానికి తగినంత ప్రాధాన్యత ఇవ్వలేదని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. ఆదివారం వైరా బోడేపూడి భవన్‌లో జరిగిన స్టడీ సర్కిల్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించిన బడ్జెట్‌లపై ఆయన ప్రసంగించారు. రెండు ప్రభుత్వాలు బడ్జెట్‌లో వ్యవసాయరంగానికి మొండిచెయ్యి చూపించారన్నారు. సీతారామ ప్రాజెక్ట్ కు రూ.2 వేల కోట్లు కేటాయింపులు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి ప్రేమ్‌కుమార్, చంద్రశేఖర్, సుధాకర్, నాగేశ్వరరావు, సమత, మధు, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు శ్లోకాలపై అవగాహన

మధిర: మధిర పట్టణంలోని భగవాన్ శ్రీ సత్య సాయి బాబా సేవా సమితి మధిర వారి ఆధ్వర్యంలో స్థానిక శ్రీ వేణుగోపాలస్వామి గీతా మందిరంలో నూతన బాల వికాస్ సెంటర్‌ను ప్రారంభించారు. ఆదివారం ఈ కేంద్రంలో 18 మంది బాల బాలికలు పాల్గొని శ్లోకాల పఠనం చేశారు. బాల వికాస్ గురువులు వెంకట మురళీకృష్ణ విద్యార్థులకు శ్లోకాలను నేర్పించడంతోపాటు వారికి సంపూర్ణ అవగాహన కల్పించారు. ముందుగా వేణుగోపాల స్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు గొండేల సూర్యప్రకాశరావుని సన్మానించారు. శ్రీ సత్య సాయి సేవా సమితి బాల వికాస్ కోఆర్డినేటర్ పద్మావతి, ఆలయ అర్చకుడు ప్రసాద్ పాల్గొన్నారు.

దెబ్బతిన్న ఇళ్ల పరిశీలన

సత్తుపల్లిరూరల్: సింగరేణి బొగ్గు తవ్వకాల కోసం చేపడుతున్న బాంబుల మోతతో పరిసర గ్రామాల్లోని ఇల్లు కూలిపోతున్నాయని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు జాజిరి శ్రీనివాస్ ఆరోపించారు. ఆదివారం సత్తుపల్లి, కిష్టారం, రాజీవ్‌నగర్, వెంగళరావునగర్ తదితర ప్రాంతాలను సందర్శించి దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించారు. సింగరేణి వచ్చాక బాంబుల మోతతో పాటు కాలుష్యం పెరిగిందన్నారు.ఇప్పటికైన సింగరేణి యాజమాన్యం స్పందించి బ్లాస్టింగ్ నిబంధనలు పాటించకుంటే సింగరేణిని ముట్టడిస్తామని హెచ్చరించారు.

పాలాభిషేకం

ముదిగొండ: మండలంలోని వెంకటాపురంలో రైతులు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల, పొంగులేటి చిత్రపటాలకు ఆదివారం పాలాభిషేకం చేశారు. రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి అధిక నిధులు కేటాయించి రైతులకు పెద్దపీట వేసినందుకు హర్షం వ్యక్తం చేస్తూ.. ర్యాలీ నిర్వహించారు. మాజీ జెడ్పీటీసీ నాగేశ్వరరావు, వీరబాబు, ఝాన్సీరాణి, రామయ్య, బాలచందర్, ఉపేందర్‌రావు, రమేష్ పాల్గొన్నారు.

అమరుల స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు

చింతకాని: అమరవీరుల స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలను నిర్వహిస్తామని సీపీఎం మండల కార్యదర్శి మడుపల్లి గోపాలరావు తెలిపారు. మండల పరిధిలోని పందిళ్లపల్లి గ్రామంలో నిర్వహించిన సీపీఎం నాయకులు అలవాల శ్రీనివాసరావు వర్ధంతిలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీజేపీ అనుసరిస్తున్న తెలంగాణ వ్యతిరేక విధానాలకు ఉద్యమాలను నిర్వహించాలని సూచించారు. అనంతరం శ్రీనివాసరావు స్మారక స్తూపం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు జానికిరాములు, కోటేశ్వరరావు, నారాయణ, ప్రభాకర్, ప్రసాద్, రామయ్య పాల్గొన్నారు.

అమరుల ఆశయ సాధనకు పోరాడుదాం

ముదిగొండ: అసమానతలు లేని సమాజ స్థాపన కోసం, ఆరోగ్య వంతమైన సమాజం కోసం అమరవీరుల ఆశయ సాధన కోసం పోరాడుదామని సీపీఎం రాష్ట్ర నాయకుడు పొన్నం వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆదివారం ముదిగొండలో సీపీఎం మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం అధ్యక్షతన భూపోరాట అమరుల వర్ధంతి సభలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు వాసిరెడ్డి వరప్రసాద్, వైస్ ఎంపీపీ దామోదర్, నాయకులు తదితరులు ఉన్నారు.

బాబోయ్ పాములు..

- పొంచి ఉన్న సర్పాల గండం
- పల్లెల్లో, పంట పొలాల్లో భద్రం
- అప్రమత్తంగా ఉండాలని వైద్యుల సూచన

అసలే వానాకాలం ఆపై పాముల భయం.. వ్యవసాయ పనుల్లో తలమునకలైన రైతులు గతంలో పాము కాటుకు గురై నిండు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. అయితే గ్రామాల్లో, తండాల్లో మంత్రాలు చేసేవారిని, చెట్ల మందును నమ్మి ప్రాణాల మీదకి తెచ్చుకుంటారు. పాముకాటుకు గురైన వారు ఆస్పత్రికి రావాలని మూఢ నమ్మకాలు తగవని వైద్యులు సూచిస్తున్నారు.



వేంసూరు: బాబోయ్ పాము అంటూ భయపడే రోజులొచ్చేశాయ్. వర్షాకాలంలో భూమి మొత్తం తడిసి పుట్టల్లో నీరు నిలవడంతో విషసర్పాలు భయట సంచరిస్తుంటాయి. పొలాల గట్ల వెంట, పంటచేను సమీపంలోని ఇళ్లు, గుడిసెలు అన్నీ వీటికి ఆవాసాలే. మనిషి ప్రాణాలు తీసే సర్పాల పట్ల అప్రమత్తంగా ఉండాల్సిందే. ఇంటి పరిసరాల్లోని కట్టెలు, తట్టలు, బుట్టలు, బస్తాల చాటున ముడుసుకొని అదునుకోసం ఎదురుచూస్తుంటాయి. అదే విధంగా పంట చేలల్లో పనులు చేసే క్రమంలో అనేక మంది కూలీలు, రైతులు పాము కాటుకు గురవుతుంటారు.

అన్నదాత అప్రమత్తంగా ఉండాలి..

వ్యవసాయ సీజన్ ప్రారంభమైనందున రైతులు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. తెల్లవారుజాము, అర్ధరాత్రి అనే తేడా లేకుండా పొలాల్లోకి వెళ్లి పనులు చేస్తుంటారు. బయటకు వెళ్లేటప్పుడు చెప్పులు కానీ షూ వేసుకోవాలి. తప్పనిసరిగా టార్చ్, కర్ర తీసుకెళ్లాలి. అదే విధంగా ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు, పిచ్చి మొక్కలు లేకుండా చూసుకోవాలి. పడుకునేటప్పుడు దుప్పట్లు దులపాలి. నవారు, నులక పంచాలను చిన్నకర్రతో కొట్టి అందులో ఏమీలేవని నిర్ధారించుఉన్న తర్వాతే వేసుకోవాలి.

భయాందోళనకు గురికావొద్దు..

పాముకాటుకు గురైన వారు భయాందోళనకు గురికావొద్దు. భయపడితే గుండెపోటు వచ్చే అవకాశం ఉంది. పాము కాటువేసిన ప్రదేశంలో గట్టిగా కట్టు కట్టాలి. జాప్యం చేయకుండా వెంటనే సమీపంలోని వైద్యుల వద్దకు తీసుకెళ్లి చికిత్స చేయించాలి. నాటు వైద్యులను ఆశ్రయించి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు.

పాములు విష ప్రభావం..

విషపూరితరమైన పాము కాటేస్తే శరీరం క్రమంగా నీలి రంగులోకి మారుతుంది. పాములు కాటు వేసిన చోట నొప్పి, వాపు, ఉంటాయి. కొందరికీ పొక్కులు, దద్దుర్లు వస్తాయి. మరికొందరికీ నోటి నుంచి నురగవాస్తాయి. ఆయాసం వచ్చి శరీరమంతా చెమటలు పట్టి కోమాలోకి వెళ్లే అవకాశం ఉంది. అప్పుడు గుండె సాధారణంగా కొట్టుకునే దాని కంటే రెట్టింపు స్థాయిలో కొట్టుకుంటుంది.

అందుబాటులో మందులు..



పాము కాటుకు సంబంధించి మందులు అందుబాటులో ఉన్నాయి. వర్షాకాలం కావడంతో పాములు సంచరించే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ప్రజలు అప్రమత్తంగా ఉండి సరైన జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా రైతులు, కూలీలు వ్యవసాయ పనులు చేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలి. పాముకాటుకు గురైన వ్యక్తులు నాటు వైద్యులను ఆశ్రయించకుండా.. ఆస్పత్రుల్లోని వైద్యులను సంప్రదించాలి.

– సీతారాం, డిప్యూటీ డీఎంహెచ్ఓ, కల్లూరు

ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు


మధిర: ఉత్తమ ఉపాధ్యాయులను అభినందిస్తున్న పాఠశాలల యాజమాన్యాలు

మధిర: తెలంగాణ రాష్ట్ర గుర్తింపు పొందిన ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఖమ్మంలో ఆదివారం ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం జరిగింది. సూరపునేని శేషు కుమార్ ద్వితీయ వర్ధంతి సందర్భంగా ఆయన పేరుతో ఖమ్మం ఎస్సార్ ఫంక్షన్ హాల్‌లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు కార్యక్రమం నిర్వహించగా.. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా మధిర డివిజన్ పరిధిలోని శ్రీనిధి పాఠశాలకు చెందిన కన్నెపోగు నాగరాజు, వేల్పుల ఉష, భరత్ స్కూల్‌కి చెందిన షేక్ అజీమ్, తాండ్ర ఉమ, మీనవోలు భాస్కర స్కూల్‌కి చెందిన సాలిక వాసు, కాటయ్య, సెయింట్ ఫ్రాన్సిస్ స్కూల్‌కి చెందిన వెంకటనారాయణ, జ్యోతి, అనియమ్మ, జయలక్ష్మి ఎంపికయ్యారు. అవార్డులు పొందిన ఉపాధ్యాయులను ఆయా పాఠశాలల యాజమాన్యం అంజన్ బాబు, శీలం వెంకటరెడ్డి తదితరులు అభినందించారు.

వైరాలో..


వైరా: డీఈఓ సోమశేఖర శర్మ, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘం రాష్ట్ర నాయకుల చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న లలిత


వైరా: మంత్రి తుమ్మల చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ఆది శ్రీలక్ష్మి

వైరా: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా వైరాలోని విజ్ఞాన్ పాఠశాలకు చెందిన ఆది శ్రీలక్ష్మి, రాధాలక్ష్మి, మేరీ ఇమ్మాక్యులేట్ పాఠశాలకు చెందిన ఎస్ లలిత ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక కాగా.. రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, డీఈఓ సోమశేఖరశర్మల చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు వారిని అభినందించారు.

సత్తుపల్లిలో..


సత్తుపల్లిరూరల్: అవార్డు అందుకున్న ఉత్తమ ఉపాధ్యాయులు

సత్తుపల్లిరూరల్: ట్రస్మా ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలలో సత్తుపల్లిలో కేపీఆర్ గౌతమ్ స్కూల్, టాలెంట్ స్కూల్ ఉపాధ్యాయులు కె.వాణి, లక్ష్మారెడ్డి, ఎస్‌కె జాన్‌బీ, శంకర్, రమేష్‌లు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. ఈ సందర్భంగా వీరిని పాఠశాలల నిర్వాహకులు కొప్పుల ప్రసాద్‌రెడ్డి, ఎం.ప్రభాకర్ రెడ్డి, ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్‌లు అభినందించారు.

ఏఎంసీ చైర్మన్ ఆనంద్‌కు సత్కారం


సత్తుపల్లి ఏఎంసీ చైర్మన్ ఆనంద్‌బాబును సత్కరిస్తున్న మంత్రి శ్రీనివాసరెడ్డి

సత్తుపల్లి: సత్తుపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ(ఏఎంసీ) చైర్మన్, వైస్ చైర్మన్‌గా నియమితులైన దోమా ఆనంద్‌బాబు, గొర్ల వెంకటప్పారెడ్డిలు ఆదివారం రాష్ట్ర రెవెన్యూశాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం వీరిని శాలువాతో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సత్కరించి అభినందించారు.

సూర్యప్రకాశ్‌రావు కుటుంబానికి మంత్రి పొంగులేటి పరామర్శ..

చింతకాని: మండలంలోని జగన్నాథపురం గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన గ్రామ మాజీసర్పంచ్, చింతకాని సొసైటీ మాజీ చైర్మన్, మాజీ వైస్ ఎంపీపీ కోలేటి సూర్యప్రకాశ్‌రావు కుటుంబసభ్యులను రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖామంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని కుటుంబసభ్యులను ఓదార్చారు. అనంతరం సూర్యప్రకాశ్‌రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు రాంబాబు, మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, చింతకాని సొసైటీ చైర్మన్ శేఖర్‌రెడ్డి, నాయకులు మనోహర్‌బాబు, సీతారామయ్య, నాగార్జున్, గోవిందరావు, శ్రీను, రామారావు, లక్ష్మీనారాయణ, రమేష్, ప్రగతి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ పాలకవర్గానికి సన్మానం


బదిలీ ఉద్యోగులు, గ్రామ పంచాయతీ పాలక వర్గాన్ని సన్మానిస్తున్న దృశ్యం

బోనకల్: మండలంలోని కలకోట గ్రామ పంచాయతీలో మాజీ సర్పంచ్, వార్డు సభ్యులు, బదిలీ అయిన పంచాయతీ కార్యదర్శి, ఉపాధ్యాయులను ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ పీసీసీ సభ్యుడు పైడిపల్లి కిషోర్ మాట్లాడారు. గ్రామ పంచాయతీ అభివృద్ధిలో మాజీ సర్పంచ్ యంగల దయామణి ఎనలేని కృషి చేశారని కొనియాడారు. ఉద్యోగ రిత్యా బదిలీ అయిన సెక్రటరీ, ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఇటికాల శ్రీను, యంగల ఆనందరావు, చావా లక్ష్మణరావు, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి సహకరించాలి

కారేపల్లి: వందేళ్ల చరిత్ర ఉన్న కారేపల్లిలోని శ్రీపెద్దమ్మతల్లి ఆలయ అభివృద్ధికి సహకరించాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు తురక నారాయణ, కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత గుడి నిర్వాహకులు, మాజీ సర్పంచ్ దంపతులు గుడికి సంబంధించిన లెక్కలు అప్పగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు తురక రాంబాబు, కోశాధికారి పేర్ని వెంకటేశ్వర్లు, తురక సాంబయ్య, తురక రవి, చింతల కృష్ణ, చింతల సంపత్, అక్కుల సురేష్, తురక చిన్నకోటేశ్వరరావు, అక్కుల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేట మారథాన్ రన్‌లో కారేపల్లి పోలీసులు


రన్‌లో పాల్గొన్న కారేపల్లి కానిస్టేబుళ్లు

కారేపల్లి: సిద్దిపేటలో ఆదివారం జరిగిన హాఫ్ మారథాన్ 21.1 కిలోమీటర్ల పరుగు పందెంలో కారేపల్లి పోలీస్ స్టేషన్‌కు చెందిన ముగ్గురు కానిస్టేబుల్‌లు వెంకన్న, సీతారాములు, రమేష్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మారథాన్ రన్‌ను విజయవంతంగా పూర్తి చేశామని, ఈ పరుగుపందెం శారీరక దృఢత్వంతో పాటు, నూతన ఉత్తేజాన్ని, దృఢ సంకల్పాన్ని కల్పించిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారిని సింగరేణి సీఐ తిరుపతిరెడ్డి, ఎస్ఐ రాజారాం, తోటి కానిస్టేబుల్‌లు, హోంగార్డులు, స్థానికులు అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సత్తుపల్లి: సత్తుపల్లిలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్నందున టౌన్-3 ఫీడర్‌లోని జవహర్‌నగ్, రాజీవ్‌రోడ్, కొమ్మేపల్లి కాలనీ, గుడిపాడురోడ్, వెంగళరావునగర్, ఆర్‌కె ఆస్పత్రిరోడ్ ప్రాంతాల్లో సోమవారం ఉదయం 8.30 గంటల నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సఫరా నిలిపివేయబడుతుందని ఏఈ శరత్‌బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫీడర్‌లో చెట్లు కటింగ్ వల్ల కలిగే అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఘనంగా డాక్టర్ 'కాపా' జన్మదిన వేడుకలు

వైరా: లయన్స్‌క్లబ్ గాట్ అంబాసిడర్, పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ కాపా మురళీ కృష్ణ జన్మదిన వేడుకలు ఆదివారం వైరాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక లయన్స్ కంటి ఆస్పత్రిలో నిర్వహించిన కార్యక్రమంలో కాపా గోపాలరావు కేక్ కట్ చేసి డాక్టర్ మురళీ కృష్ణకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నిరుపేద విద్యార్థులకు రెండు లాప్‌టాప్‌లు, పదిమంది నిరుపేదలకు నిత్యావసర వస్తువుల కిట్లు అందజేశారు. మరో 15 మంది నిరుపేదలకు ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించారు. చింతలపూడి వెంకటేశ్వరరావు, తోటకూర శ్రీకాంత్‌ల అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జైపాల్, రమేష్, రాంగోపాల్, రామకృష్ణ, శ్యాంబాబు, వరలక్ష్మి, ఉపేందర్‌రావు, ప్రభాకర్, నాగేశ్వరరావు, రాజారావు, కృష్ణార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

పెనుబల్లి: ప్రతి ఒక్కరూ బీజేపీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ పార్లమెంటరీ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు అన్నారు. ఆదివారం మండల అధ్యక్షులు బొర్రా నరసింహారావు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి మధుసూధన్‌రావు, మండల ప్రధాన కార్యదర్శి భవానీ శంకర్ నాయకులు మహేష్, వెంకటస్వామి, సత్యనారాయణ రెడ్డి, నాగరాజు, శివకృష్ణ, రమేష్, రామకృష్ణ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

యువకుల శ్రమదానం


రోడ్డుపై పడిన గుంతలను మట్టితో పూడ్చుతున్న యువకులు

ముదిగొండ: మండలపరిధిలోని అయ్యగారిపల్లిలో ఎస్సీ కాలనీకి చెందిన యవకులు ఆదివారం శ్రమదానం చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఆర్అండ్‌బీ రోడ్డుపై పడిన గుంతలతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో యువకులు రోడ్డు వెంబడి ఉన్న మట్టిని తవ్వి గుంతలను పూడ్చారు.

ఘనంగా బోనాల జాతర


బోనాలు సమర్పిస్తున్న మహిళలు

మధిరరూరల్: మండల పరిధిలోని వంగవీడు గ్రామంలో ఆషాఢమాసం సందర్భంగా ఆదివారం బోనాల జాతర ఘనంగా జరిగింది. స్థానిక గంగమ్మ తల్లి దేవాలయంలో గ్రామ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఈ వేడుక నిర్వహించారు. మేళతాళాలతో, డప్పు వాయిద్యాల మధ్య మహిళలు బోనాలు ఎత్తుకొని ఊరేగింపుగా తరలి వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు.

త్రివేణి పాఠశాలలో..

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని త్రివేణి పాఠశాలలో బోనాల వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పోతురాజు, అమ్మవారి అలంకరణలతో సాంప్రదాయ రీతిలో అమ్మవారికి బోనం సమర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సరిత, వైస్ ప్రిన్సిపాల్ పద్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కారేపల్లిక్రాస్‌రోడ్డులో..

కారేపల్లి: మండలంలోని కారేపల్లిక్రాస్‌రోడ్డు గ్రామంలో గ్రామస్తులు బోనాల పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలు నెత్తినపెట్టుకొని.. గ్రామంలో కొలువుతీరిన శ్రీఎర్రమ్మ దేవాలయానికి మేళతాళాల నడుమ ప్రదర్శనగా వెళ్లి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం గ్రామానికి చెందిన సిద్దంశెట్టి చిన్న నాగయ్య (ట్రాక్టర్ మెకానిక్) ఎర్రమ్మతల్లి దేవాలయానికి మైక్‌సెట్ వితరణగా అందజేశారు.

కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలి


మాట్లాడుతున్న ఎంపీపీ కోపూరి పూర్ణయ్య

చింతకాని: మండల సర్వసభ్య సమావేశానికి హాజరుకాని గ్రామ పంచాయతీ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని మండల ప్రజాప్రతినిధులు డిమాండ్ చేశారు. అదే విధంగా ఆర్టీసీ, ఫిషరీస్, విద్యుత్, విద్యాశాఖలకు సంబంధించిన అధికారుల కూడా హాజరు కాకపోవటంతో.. వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఆదివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి మండలంలోని 26మంది జీపీ కార్యదర్శులు హాజరుకాకపోవడంతో ఎంపీపీ, జెడ్పీటీసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో మిషన్ భగీరథ నీరు సక్రమంగా సరఫరా చేయాలని తెలిపారు. సమావేశంలో వ్యవసాయం, ఆరోగ్య, ఐసీడీఎస్, ఈజీఎస్, పంచాయతీ రాజ్, పశుసంవర్ధక శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలను ప్రవేశపెట్టారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీలకు చివరి సర్వసభ్య సమావేశం కావటంతో వారిని శాలువాలతో సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. అలాగే బదిలీపై వెళ్లిన మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, గ్రామ పంచాయతీ కార్యదర్శులను కూడా సన్మానించారు. ఈ సమావేశంలో ఎంపీపీ పూర్ణయ్య, జెడ్పీటీసీ తిరుపతి కిషోర్, నాగులవంచ సొసైటీ చైర్మన్ శేషగిరిరావు, ఎంపీడీఓ రామయ్య, తహసీల్దార్ రామయ్య, మండల పంచాయతీ అధికారి రవీంద్ర ప్రసాద్, ఏఓ నాగయ్య, మండల వైద్యాధికారి అల్తాఫ్, మండల పశువైద్యాధికారి డాక్టర్ రామ్‌జీ, ఎక్సైజ్ ఎస్సై సాయిబాబా, ఐసీడీఎస్ సీడీపీఓ కమలప్రియ, ఈజీఎస్ ఏపీఓ కోటయ్య, పీఆర్ ఏఈ రాంబాబు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన


పరీక్షలు నిర్వహిస్తున్న కిమ్స్ వైద్యులు

వేంసూరు: పొంగులేటి స్వరాజ్యంరాఘవరెడ్డి (పీఎస్ఆర్) చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఖమ్మం కిమ్స్ వైద్యులచే వేంసూరు జెడ్పీ పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఖమ్మం కిమ్స్ హాస్పటల్‌కు చెందిన వైద్యులు గుండె, రక్త నాళ వైద్యనిపుణుడు డాక్టర్ డి.కృష్ణ కిషోర్, న్యూరోసర్జరీ వైద్య నిపుణుడు డాక్టర్ పెద్దిరెడ్డి సుధీంద్రరెడ్డి, కిడ్నీ, మూత్ర వైద్యనిపుణుడు డాక్టర్ మురకొండ వినోద్ బాబు, ఎముకలు, కీళ్ళ మార్పిడి వైద్యనిపుణుడే డాక్టర్ రవీంద్రనాద్‌చౌదరి మల్లంపాటి, జనరల్ మెడిసిన్ రంజిత్ రావెళ్ల రోగులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. శిబిరానికి వచ్చిన రోగులకు షుగర్, బీపీ, ఈసీజీ, 2డీ ఈసీహెచ్ఓ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హాస్పటల్ మేనేజ్‌మెంట్ భీమిరెడ్డి బాబురెడ్డి, రవిరెడ్డి, మార్కెటింగ్ మేనేజర్ వెంకటేశ్వర్లు, అనీల్ హాస్పటల్ సిబ్బంది పాల్గొన్నారు.

కూరుకుపోయి 'బోరు' మంటోంది


వల్లాపురంలో ప్రధాన రహదారి పక్కనే మట్టిలో కూరుకుపోయి ఉన్న బోరు

ముదిగొండ: మండలంలోని వల్లాపురంలో ప్రధాన రహదారి పక్కనే ఉన్న మంచినీటి బోరు రిపేరుకు నోచుకోలేదు. పైగా బోరు సంగం వరకు మరంతో నిండి నిరుపయోగంగా, ప్రమాదకరంగా ఉంది. ఈ బోరుకు మరమ్మతులు చేసి.. నీటి కొరత తీర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

తూము రంగమ్మకు ఘనంగా నివాళులు

తల్లాడ: మండలంలోని గంగదేవిపాడు సొసైటీ అధ్యక్షుడు తూము వీరభద్రరావు మాతృమూర్తి తూము రంగమ్మ(87) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె భౌతిక కాయానికి సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, తుమ్మల యుగంధర్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వీరమోహన్‌రెడ్డి, కార్యదర్శి వెంకట్‌లాల్, నాయకులు, న్యాయవాది ఇమ్మడి లక్ష్మీనారాయణ, డాక్టర్ కేవీ కృష్ణారావు, ఖమ్మం అర్బన్ సీఐ బానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

మురుగు నీరు ఇలా.. వ్యాధుల వ్యాప్తి ఆగేదెలా..?


ప్రధాన రహదారి వెంట పారుతున్న మురుగు

వేంసూరు: వేంసూరు గ్రామంలో సత్తుపల్లి–విజయవాడ ప్రధాన రహదారిపై పలుచోట్ల మురుగు నీరు నిలిచి దోమలకు ఆవాసలు మారుతున్నాయి. జాతీయ రహదారి వెంట డ్రెయినేజీ లేకపోవడం, మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తు దోమలకు నిలయంగా మారటంతో సీజనల్ వ్యాధుల భారిన పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వితరణల వెల్లువ..

వీధి వ్యాపారికి తోపుడు బండి వితరణ

పెనుబల్లి: సప్తపది లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో వీధి వ్యాపారికి తోపుడు బండి వితరణగా అందజేశారు. ఆ క్లబ్ బాధ్యులు కాపా మురళీకృష్ణ జన్మదినం సందర్భంగా వ్యాపారికి రూ.10 వేలు విలువ చేసే తోపుడు బండిని వితరణగా అందజేసినట్లు క్లబ్ బాధ్యులు ఎస్‌కె అబ్దుల్ సలాం తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ బాధ్యులు జనార్దన్, సుబ్బారావు, శ్రీదర్, ఆనంద్, అనంత్, జయరాం, సత్యనారాయణ, బాబురావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో కుట్టు మిషన్..

తల్లాడ: తల్లాడ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం పీడీజీ కాపా మురళీకృష్ణ జన్మదినం సందర్భంగా నిరుపేద మహిళకు కుట్టుమిషన్ వితరణగా అందజేశారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు బెల్లంకొండ ఆంజనేయులు మాట్లాడుతూ.. రానున్న కాలంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మరిన్న సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి కటికి వెంకటేశ్వరరావు, డీసీ శ్రీనివాసరావు, కర్నాటి లక్ష్మారెడ్డి, కోశాధికారి వెంకట్‌రెడ్డి, లయన్స్‌క్లబ్ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి, వేమిరెడ్డి చిన్న కృష్ణారెడ్డి, వెంకట్‌రెడ్డి, నరసింహారావు, ప్రసాద్, నరసింహారావు పాల్గొన్నారు.

బ్లడ్ కేన్సర్ బాధితునికి ఆర్థిక సాయం

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని ద్వారకాపురి కాలనీకి చెందిన జావేద్ అనే బాలుడు బ్లడ్ కేన్సర్‌తో బాధపడుతున్నాడు. ఆస్పత్రిలో చూపించేందుకు ఆర్థిక స్థోమత లేకపోవటంతో యువసేవా సమితిని సంప్రదించగా.. వారు దాతల సహకారంతో రూ.19,247లను సేకరించారు. ఈ నగదును ఆదివారం హైదరాబాద్‌లో బాలుడు తల్లిదండ్రులకు అందించారు. ఈ సందర్భంగా యువసే సమితికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జొన్నలగడ్డ రాజు, నితిన్, రవి, శివ, వెంకటేష్, నరేష్, నాగరాజు, సాధు అఖిల్ పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి దుస్తులు పంపిణీ


దుస్తులు అందజేస్తున్న కృష్ణ దంపతులు

మధిర: మధిర పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డులో అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేద ముస్లిం కుటుంబానికి ఆదివారం ఉచితంగా దుస్తులు అందజేశారు. స్థానిక ఆజాద్ రోడ్డులో నివసిస్తున్న ప్రముఖ సామాజిక సేవకుడు లంకా కొండయ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహాత్మా గాంధీ ఓల్డ్ క్లాత్ బ్యాంకు ద్వారా సేకరించిన పాత, నూతన దుస్తులను నిరుపేదలకు పంపిణీ చేశారు. మానవసేవే మాధవసేవ అని పేర్కొన్నారు. చేడే కృష్ణ, వెంకాయమ్మ, బాబు, శర్మారావు, కృష్ణ ప్రసాద్, మురళి తదితర దాతలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.